క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మెరుగైన వైద్య చికిత్స కోసం పేద, మధ్య తరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి పథకం కింద లెనిన్‌నగర్‌కు చెందిన మనీష్‌కు రూ.50,500, సురేఖకు రూ.19,500ల చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆదివారం ఆమె జిల్లెలగూడలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్, మాజీ కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లావణ్య, సునీత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



చిన్నారులతో విశ్వకర్మ సంఘం నాయకులు

కందుకూరు: మహేశ్వరం మండల పరిధిలోని అమీర్‌పేటలో విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విశ్వకర్మ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు వడ్ల కుమారచారి, ఉపాధ్యక్షుడు ఏ.వెంకటాచారి మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా వాటికి దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. చిన్నారులకు గౌరవ, మర్యాదలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, కోశాధికారి ఆర్.శేఖర్‌చారి, ప్రచార కార్యదర్శి బాలాచారి, మోహనాచారి, సలహాదారులు శీనయ్యచారి, మల్లేశ్‌చారి, కనకాచారి, రాజ్‌కుమార్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సేవాసమితి కమిటీ ఎన్నిక



రెడ్డి సేవాసమితి సభ్యులతో సంఘం ప్రతినిధులు

మీర్‌పేట: కార్పొరేషన్‌లో బాలాపూర్ చౌరస్తా పరిధిలోని వివిధ కాలనీల్లో రెడ్డి సేవా సమితి నూతనంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో 18 మందితో కూడిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పన్నాల తులసీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తకాపు పద్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా క్లెంం వెంకట్‌రెడ్డి, గోనె కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి నరేందర్ రెడ్డి, కోశాధికారిగా కొత్త రాజేశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొండా రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం

ఎల్‌బీనగర్:ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనాథలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సామాజిక కార్యకర్త చూపూర శంకర్ అన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన రామకృష్ణ, సుజాత దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో ఆశ్రమ డైరెక్టర్ బాలేశ్వర్, సొసైటీ సభ్యులు సునిత, సందీప్, హాస్టల్ వార్డెన్ సత్తార్ పాల్గొన్నారు,

నూతన కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేస్–2 హుడా కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.ఆనంద్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా కే.సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం కమిటీ అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో జరిగిన కార్యవర్గంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, వేములయ్య గౌడ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు సిద్ధం

- రేపటి నుంచి మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మల్లన్న ఆలయం

మహేశ్వరం: మామిడిపల్లి గ్రామంలోని దొంతరాల గుట్టపై నూతనంగా నిర్మించిన మల్లన్నస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 3 నుంచి 8వ తేదీవరకు మల్లికార్జునస్వామి సహిత కేతమ్మ బొడాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యాతం పవన్ కుమార్‌యాదవ్, పెరమోని నరేశ్‌యాదవ్‌లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

పూజా కార్యక్రమాలు

3వ తేదీన గణపతి పూజ, అంకురారోహణం, అగ్నిప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, జలాధిహారం, 4వ తేదీన మండప దేవత పూజలు, చండీ హవనం, 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, విగ్రహాలకు కుంభ సంప్రోక్షణ తదితర పూజలు నిర్వహించనున్నారు. 6వ తేదీన శుక్రవారం గ్రామ దేవతలకు బోనాల సమర్పణ, 7న పుట్ట బంగారం, స్వామివారి గంగస్నానం, బోనాలు, కొట్నం. 8న తెల్లవారుజామున మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, భ్రమరాంబ దేవి కల్యాణం కనుల పండువగా జరపనున్నారు. ఉదయం 8.30 గంటలకు సూర్యబోనం, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, సాయంత్రం స్వామి వారి గడప కడగడం తదితర పూజలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బీజేపీ నేత అందెల శ్రీరాములుయాదవ్, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరవుతారన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, మల్లన్నస్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- రేపటి నుంచి 22వరకు భూభారతి
- రైతులు సద్వినియోగం చేసుకోండి
- తహసీల్దార్లు గోపాల్, సైదులు

కందుకూరు: భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా మండల పరిధి 29 గ్రామాల్లో రేపటి నుంచి 22వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయని పేర్కొన్నారు. తహసీల్దార్లు గోపాల్, శేఖర్ ఆధ్వర్యంలో రెండు బృందాలు కార్యక్రమాలు చేపట్టనున్నామని, రైతుల నుంచి భూ సమస్యల దరఖాస్తులను స్వీకరించి, పరిష్కరిస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏరోజు.. ఏ ఊరిలో

రెవెన్యూ సదస్సులు గ్రామాల వారీగా రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. 3న బాచుపల్లి, దెబ్బడగూడ, 4న పెరుగుగూడ, మహ్మద్‌నగర్, 5న పులిమామిడి, అన్నోజిగూడ, 6న ధన్నారం, తిమ్మాయిపల్లి, 9న చిప్పలపల్లి, పంజగూడ, 10న మురళీనగర్, మీర్‌ఖాన్‌పేట, 11న జైత్వారం కల్సా, గుమ్మడవెల్లి, 12న జైత్వారం మక్తా, మాదాపూర్, 13న కొత్తూర్, తిమ్మాపూర్, 16న గఫూర్‌నగర్, రాచులూరు, 17న అక్సర్లా, లేమూరు, 18న అలిఖాన్‌పల్లి, గూడూరు, 19న నేదునూరు, దాసర్లపల్లి, 20న ముచ్చర్ల, కందుకూరు, 21న సార్లరావులపల్లిలో సదస్సులు కొనసాగనున్నాయి.

మహేశ్వరం మండలంలో..

మండల పరిధి 30 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సైదులు తెలిపారు. 3న సర్దార్‌నగర్, నందుపల్లి, 4న శ్రీనగర్, తూప్రాన్ కుర్దు, 5న తుమ్మలూరు, అమీర్‌పేట, 6న ఇమాంగూడ, డబిల్‌గూడ, 9న మల్కిజ్‌గూడ, బాగ్ మంఖాల్, అల్మాస్‌గూడ, సుభాన్‌పూర్, 10న కొంగర కుర్దు– ఏ, కొంగర కుర్దు– బి, కల్వకోలు, 11న సిరిపురం, ఆఖాన్‌పల్లి, 12న మంఖాల్, నాగారం, 13న రావిర్యాల, పోరండ్ల, 16న గంగారం, కోళ్లపడకల్, 17న మొహ్బత్‌నగర్, మనసాన్‌పల్లి, 18న మహేశ్వరం, గట్టుపల్లి, 19న దిల్వార్‌గూడ, దుబ్బచర్ల, 20న వెంకన్నగూడ, పెండ్యాల, 21న గొల్లూరు, నాగిరెడ్డిపల్లెలో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఒక బృందానికి తాను, మరో బృందానికి నాయబ్ తహసీల్దార్ వి.నవత నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు.

జీపీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజ్



గ్రామ పంచాయతీ వర్కర్లతో బాలరాజ్

కందుకూరు: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రాచులూరులో గ్రామ పంచాయతీ వర్కర్లతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానంతో ప్రతి ఒక్క వర్కర్‌కు రూ.9500 ప్రభుత్వం చెల్లిస్తుందని, అందులో నుంచి రూ.7వేలు మాత్రమే వారికి అందుతున్నాయని పేర్కొన్నారు. మిగతా డబ్బులను మల్టీపర్పస్ లేని గ్రామాల్లో ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్న ఇతర వర్కర్లకు చెల్లిస్తున్నారన్నారు. మరి కొంత మంది స్వీపర్లకు కేవలం రూ.3వేలు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు రూ.26వేల చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపల్ కార్య నిర్వాహక అధ్యక్షుడు షర్ఫొద్దీన్ హామెద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఆదేశానుసారం ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరీఫ్ అలీ, కరీం, మక్దూం పటేల్, సలీం, మేరాజ్ ఖాన్, బర్కత్ అలీ, షేక్ మహ్మద్, జావీద్ పాల్గొన్నారు.

ఓపెన్ నాలాను భూగర్భ డ్రైనేజీగా నిర్మించాలి

మీర్‌పేట: ఓపెన్ నాలాను భూగర్భ డ్రైనేజీ లైన్‌గా నిర్మించాలని జిల్లెలగూడ ఓంసాయి కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని ఓపెన్ నాలాతో కొన్నేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నామని, రానున్న వర్షాకాలం దృష్ట్యా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నాలా స్థానంలో పైపులైన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్, కాలనీవాసులు విజయ్, కిషోర్, ధారల శ్రీధర్, కుమార్‌శెట్టి, రోజెకర్ ఉన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

- టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి
- అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటన



కాలనీవాసులతో నర్సింహారెడ్డి తదితరులు

మీర్‌పేట: కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గౌతమ్‌నగర్, ఆదిత్యనగర్, టీఆర్ఆర్ టౌన్‌షిప్, సాయినగర్, ఎస్‌బీఆర్‌కాలనీ, లలితానగర్, విజయహోమ్స్, రాఘవేంద్రనగర్ ఫేజ్–1, 2, న్యూగాయత్రీనగర్, దేవీగాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, బాలాజీనగర్‌లో ఆదివారం ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, నాయకులు బాల్‌రెడ్డి, సిద్దాల దశరథ, పాండుగౌడ్, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాంబశివరావు, ప్రభాకర్‌రావు, రాజేశ్వర్‌రావు, లింగారెడ్డి ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పులిమామిడిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కందుకూరు: అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ నాయకులు ఎం.రమేశ్, బి.పాండురంగారెడ్డి, పి.రవీందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పులిమామిడిలో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. వారి అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బి.మహేందర్‌రెడ్డి, పి.మహేశ్, రవి, సామేల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007–08వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఆహ్వానించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. చిన్ననాటి సంఘటనలు, జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గణేశ్, శోభన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

అసంపూర్తి పనులతో అవస్థలు



అసంపూర్తిగా వాకింగ్ పాత్



పార్కులో పేరుకుపోయిన వ్యర్థాలు

మలక్‌పేట: పార్కుల్లో సకల సౌకర్యాలు, ఆహ్లాదకర వాతవరణం కల్పించాల్సిన అధికారులు అసంపూర్తి పనులతో సరిపెడుతున్నారు. రూ.లక్షల్లో ప్రజాధనం ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో ఈ ఏడాది జనవరి 2న స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అభివృద్ధి పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ పార్కులో కేవలం పాడైన వాకింగ్ పాత్ తొలగించి కొత్తది వేశారు. తొలగించిన పాత వాకింగ్ పాత్ వ్యర్థాలు ఎక్కడి అక్కడే వదిలేయడంతో మట్టికుప్పలు, వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. అసంపూర్తి వాకింగ్‌పాత్ పనులతో నడవడానికి ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ కొరవడి కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో పచ్చదనం కరువైంది. మొక్కల సంరక్షణ లేదని, పిల్లల ఆటస్థలం అభివృద్ధికి నోచుకోలేదని పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

చాదర్‌ఘాట్: మలక్‌పేట అక్బర్‌ప్లాజా వద్ద జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు చేపట్టిన మరమ్మతు పనులను ఆదివారం జీహెచ్ఎంసీ కమిషనర్ పరిశీలించారు. మలక్‌పేటలో ట్రాఫిక్ జామ్ నివారణకు రాత్రి సమయంలో చేపడుతున్న డ్రైనేజీ పనుల పురోగతిని పరిశీలించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షల పొడగింపు

మలక్‌పేట అక్బర్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై డ్రైనేజీ మరమ్మతు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలను పొడిగిస్తున్నట్లు నగర్ ట్రాఫిక్ పోలీసుల విభాగం జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు మరమ్మతు చేస్తున్న నేపథ్యంలో మొదట శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అయితే ఆ ఆంక్షలు సోమవారం తెల్లవారు జాము 6 గంటల వరకు పొడగించినట్లు ఆయన పేర్కొన్నారు.